చింతలబస్తీలో కిషన్ రెడ్డి ర్యాలీ



నాంపల్లి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన రెడ్‌హిల్స్ డివిజన్ చింతలబస్తీలో కిషన్‌రెడ్డి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుందని తెలిపారు. రాహుల్‌చంద్ర, క్రాంతికిరణ్, దిలీప్ సింగ్, కేశబోయిన శ్రీధర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గౌలిపురా: ఈ నెల 23న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వీర్ హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం లాల్‌దర్వాజా శివాలయం వద్ద విశ్వ హిందూ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు విశాల్ ప్రసాద్, బజరంగ్‌దళ్ కో కన్వీనర్ పవన్, శ్రీనులు విడుదల చేశారు. 23న గౌలిపురా గాంధీబొమ్మ సమీపంలోని మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ బైక్ ర్యాలీ గౌలిగూడ మీదుగా తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు కొనసాగుతుందన్నారు.

శ్రీరామ నవమికి సర్వం సిద్ధం

- ముస్తాబయిన ఆలయాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

చార్మినార్: శ్రీరామ నవమి ఉత్సవాలకు పాతబస్తీలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా తదితర నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ఉత్సవాల నిర్వాహకులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయం ప్రాంగణంలో సీతారామ చంద్రుల తిరుకల్యాణ మహోత్సవాలను ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. తిరు కల్యాణ మహోత్సవానికి హాజరయ్యే భక్తులకు తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య తెలిపారు.

దూద్‌బౌలిలో...



పూలతో అలంకరించిన భాగ్యలక్ష్మి ఆలయం

దూద్‌బౌలి శివ మందిరం, ఉందాబజార్ వాసవీ భవన్, రామాలయంతో పాటు పలు ఆలయాలు ఏర్పాట్లు చేశారు. వాసవీ కల్యాణ మండపంలో కల్యాణం అనంతరం సాయంత్రం 6 గంటలకు ఉందాబజార్, దూద్‌బౌలి, మామిడికాయ మఠం తదితర ప్రాంతాల మీదుగా ఊరేగింపు ఉంటుందని కమిటీ అధ్యక్షుడు డి. ఆనంద్ గుప్తా తెలిపారు. దూద్‌బౌలి శివ మందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పూజారి మల్లికార్జున శర్మ తెలిపారు.

ముస్తాబయిన భాగ్యలక్ష్మి ఆలయం..

శ్రీరామ నవమిని పురస్కరించుకుని మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా అష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారి అభిషేకం, పుష్పాలంకరణ, హారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

సిప్లిగంజ్ కాల్ భైరవ హనుమాన్ ఆలయం నుంచి..

సిప్లిగంజ్ కాల్ భైరవ హనుమాన్ ఆలయాన్ని అలంకరించారు. ఉదయం 10 గంటల నుంచి కాల్ భైరవ ఆలయం నుంచి భారీ ఊరేగింపు ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యుడు కె. సురేందర్ తెలిపారు. ఈ ఊరేగింపు సిప్లిగంజ్, ఖబూతర్‌ఖానా, గొల్లకిడికి, పురానాపూల్ మీదుగా ధూల్‌పేట్ ప్రధాన ఊరేగింపులో పాల్గొంటుందన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఆశీష్‌కుమార్ యాదవ్



అబిడ్స్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ సమావేశమయ్యారు. పార్లమెంటు ఎన్నికలపై ఆశీష్‌కుమార్ యాదవ్‌కు కేటీఆర్ పలు సూచనలు చేశారు. ఆశీష్‌కుమార్ మాట్లాడుతూ..గోషామహల్‌తో పాటు గ్రేటర్ నలుమూలలా పార్టీ తిరుగులేని శక్తిగా ఉందన్నారు. ప్రజలంతా కేసీఆర్ పార్టీవైపే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంటు స్థానాల్లో బీఆర్‌ఎస్ విజయానికి తీవ్రంగా కృషి చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



యాకుత్‌పురా: రాంబక్షీ బండ సుధా టాకీస్ సమీపంలోని శ్రీరామాలయంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మీ సహిత సుదర్శన హోమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం హోమం నిర్వహించి విష్ణు సాహస్రనామ పారాయణం చేశారు.

'భారీ మెజార్టీతో దానం విజయం ఖాయం'



మంత్రి కొండా సురేఖతో మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా

అబిడ్స్: సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి దానం నాగేందర్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ, మేయర్ గద్వాల విజయలక్ష్మీతో కలిసి మమతా గుప్తా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ అభ్యర్థి నాగేందర్ విజయంపై చర్చించారు. అనంతరం మమతా గుప్తా మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ప్రగతి, సంక్షేమం, అభివృద్ధితోనే కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. మంత్రి కిషన్‌రెడ్డి ఏనాడు సికింద్రాబాద్ ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. నాగేందర్‌ను గెలిపిస్తే సికింద్రాబాద్ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మమతాగుప్తా పేర్కొన్నారు.

'ప్రజల సహకారంతో విజయం సాధిస్తా'



తనకు బహూకరించిన చేపలను చూపిస్తున్న మాధవీలత

గోల్కొండ: అన్ని వర్గాల ప్రజల సహకారంతో హైదరాబాద్ నుంచి భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని బీజేపీ హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి మాధవీలత అన్నారు. మంగళవారం ఆమె సబ్జిమండిలో గంగపుత్ర సంఘం వారు సన్మానించారు. సబ్జిమండి గంగపుత్ర సంఘం ప్రతినిధి కట్ట నర్సింగ్‌రావు ఆమెకు రెండు చేపలను బహూకరించారు. మాధవీలత మాట్లాడుతూ.. కుల వృత్తుల వారికి ప్రధాని మోదీ ప్రోత్సహిస్తూ వారి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు.

'నల్లధనం తెస్తామని..నల్ల చట్టాలు తెచ్చారు'



గౌరీ సతీష్

అబిడ్స్: విదేశాల్లో ఉన్న నల్ల ధనాన్ని తెచ్చి ఒకొక్కరికి రూ.15 వేలు ఇస్తానన్న ప్రధాని నరేంద్రమోదీ కేవలం నల్ల చట్టాలు తెచ్చారని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గౌరీసతీష్ విలేకర్లతో మాట్లాడుతూ..దేశంలో నిరుద్యోగ నిర్మూలన చేపడుతామన్న మోదీ ప్రభుత్వం దేశ నలుమూలలా కోట్లాది మంది నిరుద్యోగులను తయారు చేసిందన్నారు. పన్నులు తగ్గిస్తామన్న ప్రభుత్వం ప్రజలు పనులు లేకుండా చేశారన్నారు. ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌తో పాటు అన్ని రకాల ధరలను ఆకాశాన్ని అంటించిందన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే దేశం ప్రపంచంలో నెం.1 గా మారుతుందని గౌరీ సతీష్ పేర్కొన్నారు.

గర్భిణిపై దాడి చేసిన హోంగార్డుపై కేసు

చాంద్రాయణగుట్ట: ఏడు నెలల గర్భిణీపై దాడికి పాల్పడిన హోంగార్డుపై కేసు నమోదు చేసిన బండ్లగూడ పోలీసులు విచారణ చేపట్టారు. చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న మహ్మద్ ఇస్మాయిల్ సాదత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వీరి ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న బిహార్‌కు చెందిన ఏడు నెలల గర్భవతి గుల్‌నాజ్ బేగం కూతురు పర్వీన్(5)తో ఇస్మాయిల్ కూతురు ఆయేషా (9) నడుమ సోమవారం గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న ఇస్మాయిల్, మరో ఐదుగురిని వెంటేసుకొని గుల్‌నాజ్ బేగంను తన్నడంతో పాటు అడ్డొచ్చిన మహిళలను కూడా చితకబాదాడు. దాడి దృశ్యాలను స్థానిక యువకులు ఫోన్లలో చిత్రీకరించడంతో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. చివరకు బస్తీ వాసులు తిరగబడి ఇస్మాయిల్‌ను చితకబాదారు. ఇస్మాయిల్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తన భర్తపై దాడి చేశారంటూ ఇస్మాయిల్ భార్య కూడా ఫిర్యాదు చేయడంతో ఎదుటి వర్గంపై కూడా కేసు నమోదయ్యింది. హోంగార్డ్‌కు 41 సీఆర్‌పీసీ నోటీస్ ఇచ్చి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రైళ్లలో దొంగతనాలకు పాల్పడే భార్యాభర్తల అరెస్టు

నాంపల్లి: రైళ్లలో దొంగతనాలకు పాల్పడే ఓ జంటను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఒక లక్షా డెబ్బై ఐదు వేల రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ అర్బన్ డీఎస్పీ జావెద్ తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన మహెక్ మొయినుద్దీన్ షేక్(19), అజీమ్ గౌస్ షేక్ (25) భార్యాభర్తలు. వీరు రైల్వే స్టేషన్లలో దొంగతనాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 31న హైదరాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ప్లాట్‌ఫారం-4 మీద నిల్చున్న పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న ఓ వృద్ధురాలిని అనుసరించారు. బోగీ ఎక్కే క్రమంలో బ్యాగు జిప్‌ను తెరచి అందులో ఉంచిన రెండున్నర తులాల బంగారం గొలుసు, ఒక సెల్‌ఫోన్‌ను దొంగలించారు. దొంగతనం చేసిన ఇద్దరూ మహారాష్ట్రకు పారిపోయారు. మళ్లీ ఈరోజు తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్న భార్యాభర్తలు ఇద్దరూ హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో తచ్చాడూ కనిపించగా పోలీసులు అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనం చేసినట్లుగా ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రేపు ధర్నాచౌక్‌లో నిరసన



గన్‌ఫౌండ్రీ: సౌదీలోని మదీనాలో ఉన్న అల్ బకీ శ్మశానవాటికలో ధ్వంసమైన ప్రవక్త మహ్మద్ కుటుంబానికి చెందిన సమాధులను సౌదీ ప్రభుత్వం పునర్‌నిర్మించాలని అల్ బకీ ఆర్గనైజేషన్ ప్రతినిధులు షఫిక్ బెదర్, ఫిరాసత్ అలీ బక్రీలు డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అల్ బకీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న ఇందిరాపార్కు వద్ద గల ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సౌదీ అరేబియాలో ముస్లింలు పుణ్యక్షేత్రాలుగా భావించే అల్ బకీ శ్మశాన వాటికను ధ్వంసం చేసి 101 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లి సమాజం ఈ నిరసనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రియాసత్‌నగర్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ పర్యటన



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మంగళవారం రియాసత్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. దర్గా బర్హానే షా దర్గా నుంచి బస్తీల మీదుగా తిరుగుతూ ఓటర్లకు అభివాదం చేస్తూ గాలిపటం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్పొరేటర్లు సలీం బేగ్, ఫహద్ బిన్ అబ్దాద్, ఆజం షరీఫ్, రహమాన్, అబ్దుల్ వాహబ్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్, నయీం పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



రాములోరి ముస్తాబులో స్వప్న, కృష్ణ కుటుంబీకులు



సీతాదేవిని పెళ్లికూతురు వేడుకల్లో సుమలత, శేఖర్ బాబు కుటుంబీకులు



సంగం ఆలయంలో వసంతోత్సవం

లంగర్‌హౌస్: మీసాల రాములోరు, జానకీ దేవీల పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు ముస్తాబు వేడుకలు కమనీయంగా జరిగాయి. త్రివేణి సంగం రామచంద్రజీ మఠంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేదపండితుల సమక్షంలో మామిడాకులు స్వప్న, కృష్ణ దంపతుల గృహంలో శ్రీరాముని పెళ్లి కుమారుని ముస్తాబు, సాయిటెక్ ముత్యాల సుమలత, శేఖర్‌బాబుల గృహంలో లీలావతి చేతుల మీదుగా సీతాదేవి పెళ్లి కూతురి ముస్తాబు వేడుకలు, ఎదుర్కోలు వైభవంగా జరిగాయి. జానకీ సమేత వీరవెంకట విజయ రాఘవస్వామి ఆలయంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో సీతారాములకు మంగళ స్నానాలు నిర్వహించారు. అనంతరం జరిగిన వసంతోత్సవంలో సీతారాములకు రంగులు రుద్దుతూ, భక్తులు రంగులు ఆడి వసంతోత్సవంలో మునిగారు. రాజుప్రసాద్, వెంకటకృష్ణ, చంటిబాబు, రఘుపాల్ రెడ్డి, లింగారెడ్డి, గణేష్, సుశీల్, భరత్ పాల్గొన్నారు.

కష్టపడి పని చేసే వారికి గుర్తింపు



గోల్కొండ: కష్టపడి పని చేసే వారికి గుర్తింపు లభించడమే కాకుండా ఉన్నతాధికారుల ప్రశంసలు కూడా లభిస్తాయని నగర కొత్వాల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రికి చెందిన డాక్టర్ అమీనా అఫ్షాన్ షమ్రీన్ సేవలకు గుర్తింపుగా మంగళవారం ఆమెకు ప్రశంసాపత్రం అందజేశారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో వైద్యురాలిగా పని చేస్తూనే డాక్టర్ అమీనా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న భరోసా సెంటర్‌లో అత్యుత్తమమైన సేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఆమె ఎందరికో కౌన్సెలింగ్ విజయవంతంగా నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కవిత, శ్వేత తదితరులున్నారు.

అమ్మాయిలకు విద్య ఎంతో అవసరం

గన్‌ఫౌండ్రీ: అమ్మాయిలకు విద్య ఎంతో ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా డీఐజీ రమా రాజేశ్వరీ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో అబిసెంట్ మహిళా కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అమ్మాయిలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ సీవీ.రంజని, కార్టూనిస్ట్ శ్రీధర్, కళాశాల కార్యదర్శి శ్యామ్‌సుందర్ రెడ్డి, అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్, జి.శృజన, రాజవల్లిలతో పాటు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.